అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎంపీ చర్చలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పార్లమెంటు పరిధిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం జిల్లా కలెక్టర్‌ను చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు కలసి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా తిరుపతి -కాట్పాడి డబుల్ లైన్ ఏర్పాటు, మామిడి రైతుల గిట్టుబాటు ధరలు, చిత్తూరు జిల్లాలో ఎంపీ నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో ఎంపీ చర్చించారు.

వేతన వేతలు..

- ఉపాధి కూలీలకు కూలి డబ్బులు ఇవ్వని సర్కారు
- జిల్లాలో 35.7కోట్లు మేర బకాయి
- 100 రోజులుగా వేతనాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్

గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 100 రోజులుగా వేతనాలు చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ ఏడాది జనవరి నెల నుండి ఉపాధి కూలీలకు ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదు. 100 రోజులపాటు చేసిన పనులకు సంబంధించి దాదాపు చిత్తూరు జిల్లాలో 31మండలాల్లో రూ.35.7 కోట్లను కూలీలకు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. సుమారు 45వేల మంది ఉపాధి కూలీలు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని రోజుల్లో పేదలు ఉపాధి హామీ పనుల పైనే ఆధారపడుతుంటారు. వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోవడంతో నిరుపేద కూలీలు ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబం పోషించుకుంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టంకు 2025 జనవరి నుండి నిధులు విడుదల కాకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం. ఉపాధి పనులు చేపట్టిన 15 రోజులు ఒక్కసారి ఉపాధి బిల్లులు చెల్లించాలని ఉపాధి హామీ చట్టం చెబుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నిధులు విడుదలలో జాప్యం జరుగుతున్నాయి. నిధులు విడుదల కాకపోవడంతో ఉపాధి కూలీలు చేసిన పనుల బిల్లుల కోసం నెలలు తరబడి వేసి చూడాల్సిన పరిస్థితి.

బిల్లుల కోసం రెండు నెలలుగా ఎదురుచూపులు

- లక్ష్మయ్య, యాదమరి మండలం

ఓటివారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కింద మామిడి చెట్లకు కందకాలు పనులు జనవరి నెలలో ఉపాధి పనులు చేసాం. రెండు నెలలు అయ్యింది. ఇంతవరకు కూలీ డబ్బులు మా అకౌంట్లో జమ కాలేదు. డబ్బులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

ఐదు వారాలు ఉపాధి పనులు చేసాం..

- ఎం.లక్ష్మి, మాదిరెడ్డిపల్లి గ్రామం, యాదమరి

ఉపాధి హామీ పనులు ఆరు వారాలపాటు మా గ్రామంలో చేసాం. సుమారు 10 వేల రూపాయలు మాకు రావాల్సి ఉంది. 100 రోజులుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాం. ఆఫీసులో అడిగితే ఈరోజు, రేపని సమాధానం చెబుతున్నారు. చేసిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో మహిళా సంఘంలో లోన్లు సకాలంలో కట్టలేక పోతున్నాం.

మండలంలోని మామిడి తోటల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫోటో)

ఉపాధి నిధులు విడుదలవుతాయి..

- రవికుమార్, ఉపాధి హామీ చిత్తూరు జిల్లా సంచాలకులు

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు బకాయిలు వారం రోజుల్లో ప్రభుత్వం విడుదల చేస్తుంది. నిధులు విడుదలైన వెంటనే వారి వ్యక్తిగత ఖాతాల్లో జమవుతాయి. ఉపాధి కూలీలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉపాధి పనులు చేసిన కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

బకాయి డబ్బులు వెంటనే ఇవ్వాలి

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్

జిల్లాలో ఉన్న ఉపాధి హామీ కూలీలకు చట్టంలో ఉన్న సౌకర్యాలు అన్ని కల్పించాలని, బకాయి ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలి. గత ఎనిమిది సంవత్సరాలగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేసవికాలంలో ఇవ్వాల్సిన మజ్జిగ, ఎండ తీవ్రతను తట్టుకోవడానికి టెంట్, మంచినీరు, ఇతర పరికరాలు గడ్డపార, పారా, తట్టెడ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం దారుణం. జిల్లాలో అన్ని గ్రామాల్లో కూడా ఉపాధి పనులు లేకపోవడం వలన కూలీలు వలసలు పోవలసిన పరిస్థితి ఏర్పడింది. చట్టంలో ఉన్న ప్రకారం రోజువారి వేతనం గిట్టుబాటు కావడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి కూలీలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి.

వెట్టిచాకిరీ నుంచి విముక్తికి చర్యలు

డివిజన్ స్థాయిలో తహశీల్దార్లకు అవగాహన: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో నిర్బంధ వెట్టిచాకిరీకి బలౌతున్న కూలీలకు విముక్తి కలిగించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నిర్బంధ వెట్టిచాకిరీ కూలీ విధానం నిర్మూలన పై జేసి జి.విద్యాధరితో కలసి సంబంధిత అధికారులు, రోప్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్బంధ వెట్టిచాకిరీ విధానం పౌల్ట్రీ, పరిశ్రమలు, ఇటుకల తయారీ ప్రాంతాలలో చాలా వరకు అమలవుతున్నదని, దీని కారణంగా ఆర్థిక, శ్రమ దోపిడితో ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించడానికి ఆర్‌డిఓలు డివిజన్ స్థాయిలో తహశీల్దార్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 1976 నిర్బంధ కూలీ విధానం నివారణ చట్టంను పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్మికశాఖ, డిఆర్డిఏ, డ్వామా, జెడ్పి సిఈఓ, తదితర అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్ళిన తరుణంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి నిర్బంధ కూలీలని గుర్తించాలన్నారు. నిర్బంధ కూలీలకు పునరావాసం కలిగించిన అనంతరం వారు గతంలో చేసిన పనులకు సంబంధించి బాండెడ్ లేబర్ రిలీఫ్ సర్టిఫికేట్ మంజూరు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఉపాధి కల్పించి వారి అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. బాండెడ్ లేబర్ సమస్యలు వారిని గుర్తించే విధానాలు, వారు ఎదుర్కొంటున్న పరిస్థితులు, వారి రక్షణ, సంబంధిత అంశాలపై విపులంగా చర్చించారు. ఈకార్యక్రమంలో భాగంగా వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా ఒక నేరం అంశాలకు సంబంధించి గోడ పత్రికలు, కర పత్రాలను కలెక్టర్, జేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జెడ్పి సిఈఓ రవికుమార్ నాయుడు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఓంకార్, డిపిఓ సుధాకర్ రావు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, నెహ్రూ యువజన కేంద్రం కొఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, డిటిడబ్ల్యుఓ మూర్తి, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, రోప్స్ సంస్థ ఛైర్మన్ ధనశేఖర్, ప్రోగ్రామ్ హెడ్ శాం జెబాదురై పాల్గొన్నారు.

నిర్బంధ వెట్టి చాకిరి నిర్మూలనపై మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

19న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డిఆర్‌డిఎ సంయుక్తంగా ఈనెల 19వ తేదీన శనివారం స్థానిక ప్రభుత్వ పివికెఎన్ గవర్నమెంట్ డిగ్రీ (ఎ) కళాశాలలో నిర్వహించే జాబ్ మేళాలని ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఎంపి, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19న శనివారం స్థానిక ప్రభుత్వ పివికెఎన్ గవర్నమెంట్ డిగ్రీ (ఎ) కళాశాలలో నందు నిర్వహించే జాబ్‌మేళాలని ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అన్ని పంచాయతీ, వార్డు, సచివాలయాలోని పరిధిలో ఉన్న ఉద్యోగ అర్హులను గుర్తించి వారికీ సమాచారం చేరవేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ జాబ్ మేళాకు దాదాపు 20 కంపెనీలు 1000 ఖాళీలతో విచ్చేయుచున్నాయని, కనీస విద్యార్హత 10వ తరగతి నుండి డిగ్రీ ఫెయిల్/పాస్ అయిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. వివరాలకు నారాయణ రావు 9985442270, నాగరత్నం 8520048041 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యం.గుణశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ జ్యోతి, జిల్లా ప్లేసేమెంట్ అధికారి చైతన్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్ మేళా గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు

పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీ

రాజకీయపార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా తయారీపై మాట్లాడుతున్న డిఆర్ఓ మోహన్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నదని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ సమావేశ మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి ఈఆర్ఓలు, ఏఆర్ఓలు, బిఎల్ఓలు చర్యలు చేపడుతున్నారని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్నదని, మరణించిన వారి ఓటును కుటుంబ సభ్యులకు నోటిస్ అందించి తొలగిస్తున్నామని తెలిపారు. ఒక ఓటరు రెండు నియోజకవర్గాలలో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు గుర్తించినట్లైతే బిఎల్ఓల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా 6665 ఓటర్లను తొలగించడం జరిగిందని, ఇందులో 642 మంది ఓటర్లు మరణించారని, 5588 మంది ఓటర్లు వలస వెళ్ళారని, 435 మంది ఓటర్లు పునరావృతం అయినట్లు గుర్తించామని తెలిపారు. ఈసమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి వి.సురేంద్ర కుమార్, సిపిఎం వి.గంగరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఏ.పరదేశి, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, వైసిపి ఎన్.ఉదయ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బాల సుబ్రహ్మణ్యం, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోర్టు ఆర్డర్ అమలు చేయాలి

కలెక్టర్‌కు పంచాయతీ కార్మికుల వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లాలో పంచాయతీ కార్మికులకు టెండర్లు రద్దుచేసి పర్మినెంట్ కార్మికులుగా తీసుకోవాలని కోర్టు ఆదేశాలను అమలు చేయాలని జనవరిలో కలిసిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ అమలు కాకపోవడంతో కార్మికుల మళ్లీ కోర్టును ఆశ్రయించగా వెంటనే ఆర్డర్స్ను ఇంప్లిమెంట్ చేయమని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో మంగళవారం ఈ తీర్పు ప్రకారం అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సాయంత్రమే డిపిఓతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట రామయ్య, చిత్తూరు జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు, తిరుపతి జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం లక్ష్మీనగర్ కాలనీలోని ప్రజాదర్బార్‌లో 16వ తేదీ బుధవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

వేసవిలోనూ విద్యుత్ అంతరాయం లేదు

ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరుఅర్బన్ డివిజన్ పరిధిలోని చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాలో వేసవి కాలంలో విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. డివిజన్ పరిధిలోని రోజు దాదాపు 27 మిలియన్ యూనిట్లు వినియోగం అవుతోందని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ వాడుకొని సబ్సిడీ వినియోగించుకోవాలని తెలిపారు. ఇందులో వచ్చే విద్యుత్ పోను మిగులు విద్యుత్‌ను సంస్థ కొనుగులు చేస్తుందన్నారు. రైతులు విద్యుత్ సమస్య వచ్చినప్పుడు సొంతంగా రిపేర్ చేయవద్దు అని, సమస్యలు ఉంటే 1912 కు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సమాజహితం కోరే జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా బాధ్యతను వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మంగళవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు ఈనెల 22వ తేదీన చిత్తూరు జిల్లా నాలుగో మహాసభలకు గౌరవ అతిథిగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ విద్యాధరిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత జీవితాలను మెరుగుపరిచేందుకు కూడా జర్నలిస్టులు ఆలోచించాలని తెలిపారు జర్నలిస్టుల సంక్షేమానికి తాను అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాలుగో మహాసభలు జయప్రదం కావాలని ఆకాంక్షించారు. జర్నలిస్టులు ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. వృత్తి నైపుణ్యత పెంపొందించుకునేందుకు కూడా జర్నలిస్టులు సంఘాలు ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు కవర్లకుంట జయరాజు, జిల్లా అధ్యక్షులు ప్రకాష్, ఏపీ బీజేఏ అధ్యక్షులు జయచంద్ర, కార్యదర్శి నీరజాక్షులు, కోశాధికారి కృపానందరెడ్డి, సంయుక్త కార్యదర్శి యాదవేంద్ర రెడ్డి, ప్రచార కార్యదర్శి దినేష్ కుమార్, చిత్తూరు నియోజకవర్గం అధ్యక్షులు కేశవులు, కోశాధికారి నాగరాజు, కార్యదర్శి బాలసుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి ఉమా కుబేంద్రన్, వైస్ ప్రెసిడెంట్ మురళి, ప్రసాద్, దాము, మంజు పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి

నిఖిత్ చౌదరిని అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: 2025 ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు చిత్తూరు పార్లమెంటులో ద్వితీయ ర్యాంకు నిలిచిన గంగాధర నెల్లూరు నెల్లూరు మండలం, గారంపల్లె గ్రామానికి చెందిన ఎ.నిఖిత్ చౌదరిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన నికిత్ చౌదరిని మంగళవారం చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద రావు వెంట తీసుకుని వెళ్లి కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి విద్యార్థి గురించి తెలియజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే 989 ఉత్తమ మార్కులను సాధించిన నిఖిత్ నిదర్శనమన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా నికిత్‌కు ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం కావాలన్న అందిస్తామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ విద్యాదరి నిఖిత్ చౌదరిని అభినందించారు.

ఎంపీతో పాటు జిల్లా కలెక్టర్‌ను కలిసిన నికిత్ చౌదరి

నేడు అసెంబ్లీ పద్దుల కమిటీ పర్యటన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 16వ తేదీ బుధవారం ఒక రోజు పర్యటనలో భాగంగా అసెంబ్లీ పద్దుల కమిటీ జిల్లాకు విచ్చేయనుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ పద్దుల కమిటీ ఛైర్మన్ జోగేశ్వర రావుతోపాటు 11 మంది సభ్యులతో కూడిన పద్దుల కమిటీ 16న ఉదయం తిరుపతి నుండి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు చిత్తూరు ఆర్ అండ్ బి అతిథి గృహం చేరుకుంటుందని, 2 గంటలకు జెడ్పి సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించి సాయంత్రం 5.30 గంటలకు రోడ్డు మార్గంలో తిరుమల బయల్దేరి వెళ్ళడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. శాసన సభ్యులు అఖిల ప్రియ భూమా, బండారు సత్యానంద రావు, జయకృష్ణ నిమ్మక, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారథి వాల్మీకి, పాసిం సునీల్ కుమార్, ఏలూరి సాంబశివరావు, ఎంఎల్‌సిలు పర్చూరి అశోక్ బాబు, డాక్టర్ వరహ వెంకట సూర్యనారాయణ రాజు పెనుమస్త, వరుడు కళ్యాణి కమీటీ సభ్యులుగా ఉన్నారు.

యాస్మిన్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మతాంతర వివాహం చేసుకున్న యాస్మిన్ మృతిపై అనేక రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రేమ వివాహం, మతాంతర వివాహం కావడంతో మొదటి నుంచి అమ్మాయి తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించకపోవడం చూస్తే యాస్మిన్ మరణం అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. యాస్మిన్ భర్త పరువు హత్యగా చెప్తున్నప్పటికీ ఇప్పటివరకు విచారణ చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తండ్రికి అనారోగ్యంతో ఉన్నాడని పిలిపించుకొని ఒక గంటకే ఇలా మరణవార్త వినడం దుర్మార్గమన్నారు. పరువు పేరుతో కన్నబిడ్డలని హత్య చేయడం గతంలో కూడా పలమనేరు ప్రాంతంలో జరిగిన విషయం అందరికీ తెలిసిందేనని, యాస్మిన్ మృతి కూడా అలాంటి ప్రరిణామాలకు అద్దం పడుతున్నట్లు అనుమానం వ్యక్తమవుతున్నదని అన్నారు. చుట్టుపక్కల ప్రజలు కూడా ఈ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిసిందన్నారు. యాస్మిన్ భర్త కూడా హత్యేనని ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని, ఇప్పటికైనా టు టౌన్ పోలీసులు సమగ్రంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దిగుబడి లేక దిగులు!

- పూత గంభీరం.. దిగుబడి నామమాత్రం
- తగ్గిన మామిడి
- రైతుల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: పండ్ల రకాలలో మామిడి పండ్లను ఫలరాజు అంటారు.. తింటూ ఉంటే ఆ రుచి వేరుగా ఉంటుంది. కొంత మంది పక్క రాష్ట్రాలలో నివసిస్తున్న బంధువులకు ఈ జిల్లా నుంచి మామిడి ఫలాలను అక్కడికి అందిస్తుంటారు. సీజన్ ప్రారంభం నుంచి మామిడి కాయలు ఎగుమతి రవాణా ఎక్కువగా ఉంటుంది. మార్చి చివరి వారం నుంచి ఈ సీజన్ ప్రారంభం అవుతుంది. దీంతో ఉపాధి, కూలీలు, రవాణా వ్యవస్థ పుంజుకుంటుంది. ఎంతో మందికి జీవన భృతి కల్పిస్తుంది. అయితే ఎస్ఆర్‌పురం మండలంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. ఈ ఏడాది మొదటి నెలలో మామిడి చెట్లలో పూత ఏపుగా వచ్చింది. దీంతో మండల రైతుల ఆశలకు అంతే లేకుండా పోయింది. రెండు నెలల వ్యవధిలోనే వివిధ కారణాల వల్ల చెట్లలో మామిడి పూత రాలిపోయి పిందెలు లేకుండా కనుమరు గయ్యాయి. రైతుల ఆశలు ఆవిరయ్యాయి. రైతుల గుండెల్లో నిరాశ గుబులు ఆవరించింది.

దిగుబడి లేక దిగులు!

గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలంలో సుమారు 2,500 ఎకరాల మామిడి పంటను ప్రతి ఏటా సాగు చేస్తున్నారు. జనవరిలో మామిడి పూత విరగ పూసింది. రైతుల ఆశలు చిగురించాయి. అప్పుచేసి మామిడి పంట లపై మందులు పిచికారీ చేశారు. చేసిన అప్పుల నుండి బయట పడి కోలుకుంటామని మామిడి రైతు కుటుంబాలలో ఆశ నెలకొంది. క్రమేణా ఆశలు సన్నగిల్లాయి. ఫిబ్రవరి చివరివారం నుండి మార్చి మొదటి వారం కల్లా మామిడి పూత రాలిపోయి ఆకులు మాత్రమే మిగిలాయి. చివరికి రైతుకు కన్నీరే మిగిలింది. మామిడి పంట దిగుబడి లేక పంటపై చేసిన ఖర్చు అధికమైంది. చేసిన అప్పులు మాత్రం రైతుల కళ్లెదుట కనిపిస్తున్నాయి.. ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచని స్థితి కూటమి ప్రభుత్వం మామిడి రైతు కుటుంబాలను గుర్తించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

జనవరిలో పూత అధికంగా వున్న మామిడి చెట్లు

మార్చిలో పూత రాలిన మామిడి చెట్లు

ఇటీవల గాలివానకు నేల రాలిన మామిడి పిందెలు

పెట్టుబడి ఎక్కువ...ఫలితం అంతంతమాత్రం..

మాకు మూడు ఎకరాల మామిడి తోట ఉంది. ఈసారి మామిడి సంరక్షణకు పూత పూయడానికి, మామిడి కాయ రాలిపోకుండా నిలవడానికి, కాయ దిగుబడి సమయంలో పండు ఈగలు కాయను కుట్టకుండా ఉండడానికి, కాయ నాణ్యతకు ఇలా మూడుసార్లు మామిడి తోటకు క్రిమి సహకారక మందులు పిచికారీ చేశాము.. ఒక్కసారి మందు పిచికారీకి 20 వేల రూపాయలు చొప్పున 60 వేల రూపాయలు ఖర్చు అయ్యింది. ఇంత ఖర్చు చేయడంతో మామిడి పూత విరగపూసింది. కానీ పూత పూత గానే రాలిపోయి మామిడి ఆకులు మాత్రమే మిగిలాయి. పెట్టుబడి అధికమైంది.. కానీ ఫలితం అంతంత మాత్రంగానే వుంది..

- టి అమ్ములు, మామిడి రైతు, కటిక పల్లె గ్రామం, ఎస్ఆర్ పురం మండలం.

గాలివాన బీభత్సం.. పిందెలు నేలపాలు..

ఇటీవల గాలివాన బీభత్సం వచ్చి చెట్లో వున్న పిందెలు, కాయలతో సహా నేలపాలు అయ్యాయి. గత మూడు రోజులుగా వీచిన గాలివాన బీభత్సానికి ఉన్న నాలుగు పిందెలు కూడా నేలపాలయ్యింది. ప్రతి సంవత్సరం ప్రకృతి వైపరీత్యం, వాతావరణ మార్పుల వల్ల దిగుబడి లేక పెట్టిన పెట్టుబడి చేతికి రాక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం మామిడి రైతులను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని, మామిడికాయలకు కనీస మద్దతు ధరలు కల్పించాలి.. దళారీ వ్యవస్థను నిర్మూలించాలి.

- యేసు రత్నం, మామిడి రైతు, 49 కొత్తపల్లి మిట్ట గ్రామం, ఎస్ఆర్ పురం మండలం.

మామిడి రైతులను ఆదుకోవాలి

మామిడి రైతులకు ఎకరాకి 20 వేల రూపాయలు ప్రభుత్వం ఇప్పించాలి. కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు ఎకరాకు 20వేల రూపాయల చొప్పున అందిస్తే కనీసం అప్పుల బారి నుండి బయటపడతారు. ఒక్కసారి మందు పిచికారీ చేయాలంటే 20వేల రూపాయలు అవుతుంది. మామిడి తోపు దున్నేందుకు, పాదులు తీసేందుకు, మందులు పిచికారీ చేసేందుకు అయ్యే ఖర్చు కూడా ఈసారి రావడం లేదు. నాకు ఎనిమిది ఎకరాల మామిడి తోపు ఉంది. మామిడి పూత బాగా వచ్చింది.. కానీ కనీసం ఆర టన్ను మామిడికాయలు కూడా చేతికి రావు. అలాంటప్పుడు రైతులు ఎలా కోలుకుంటారు? రాష్ట్ర ప్రభుత్వం రైతులను గుర్తించి ఆదుకోవాలి

- పి. గుణశేఖర్ నాయుడు, మామిడి రైతు, పిల్లిగుండ్లపల్లి గ్రామం, కటిక పల్లి గ్రామపంచాయతీ, ఎస్ఆర్ పురం.

శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆత్మస్థైర్యం పెంపొందించేందుకే అవగాహన

శక్తియాప్ అవగాహనా సదస్సులో డిఎస్పి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యువతులలో భద్రతపట్ల నమ్మకం కల్పించడమే లక్ష్యంగా, ఆకస్మిక పరిస్థితుల్లో స్పందించే శారీరక, మానసిక ధైర్యాన్ని పెంపొందించే విధంగా చిత్తూరు జిల్లా మహిళా పోలీసుల ఆధ్వర్యంలో శక్తి యాప్‌లపై అవగాహనతో పాటు స్వీయ రక్షణ పాఠాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు శక్తి టీం నోడల్ అధికారి అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇంచార్జ్ అడ్మిన్ ఆర్ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో మంగళవారం పట్టణంలోని సీతమ్స్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో మహిళా స్టేషన్ డిఎస్‌పి విజయశేఖర్ విద్యార్థులకు అవగాహన సదస్సుతో పాటు స్వీయరక్షణ పాఠాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అత్యవసర సమయంలో ఒకే బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చేరుతుందని, ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయడం, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు, అత్యవసర సేవలు అందించేందుకు ఇది ఎంతో మేలైన సాధనమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో స్వీయరక్షణ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేకశిక్షణా శిబిరాన్ని సీతమ్స్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో నిర్వహించింది. మహిళా విద్యార్థులు తమను తాము రక్షించుకునే విధంగా అవసరమైన సాంకేతికతలు, సమయస్ఫూర్తితో స్పందించ డానికి అవసరమైన నైపుణ్యాలను శిక్షకుల సహాయంతో కరాటే, కుంగ్‌ఫూ వంటి ప్రాథమిక స్వీయరక్షణ విధానాలను నేర్పించారు.

నేడు బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపులు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలో ఈ నెల 16వ తేదీ బుధవారం కస్టమర్ మాసం సందర్భంగా పలమనేరు డివిజన్ హెడ్ ఆఫీస్‌లో కస్టమర్ సర్వీస్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు బిఎస్ఎన్ఎల్ డీఈ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ బుధవారం ఉదయం 10.30 నుండి సాయంకాలం ఐదు గంటల వరకు పలమనేరు డివిజన్ కార్యాలయంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంగణంలో నిర్వహించే కస్టమర్ క్యాంపును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్‌తో వైసిపి మండల కార్యదర్శి చలపతి

వైసిపి మండల సెక్రెటరీగా చలపతి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహ న్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన మండల కమిటీ నియా మకాల్లో శాంతిపురం మండల పరిధిలోని నడింపల్లికి చెందిన పి చలపతి మండల సెక్రెటరీగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సెక్రటరీగా ఎంపికైన చలపతి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి చురుకైన కార్యకర్తగా పార్టీ కోసం చేసిన సేవ లను గుర్తించి తనకు పార్టీలో ఈ పదవిని కేటాయించడం సంతోషకర మన్నారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తా నన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిధున్ రెడ్డి, కుప్పం ఇన్‌ఛార్జి ఎమ్మెల్సీ భరత్, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, ఎంపీపీ కోదండ రెడ్డి, తన సహచర నాయకులు మిత్రులు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న నగరి డిఎస్‌పి సయ్యద్ అహ్మద్ అజీజ్

శాంతియుతంగా నిర్వహించాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలో త్వరలో ప్రారంభం కానున్న మహా భారత ఉత్సవా లను ప్రశాంత వాతా వరణంలో నిర్వహించు కోవాలని నగరి డిఎస్‌పి సయ్యద్ అహ్మద్ అజీజ్ సూచించారు. మంగళ వారం వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో జరుగు తున్న జల్లికట్టు నిర్వహించ కూడదని, మహాభారత ఉత్సవా లలో ఆకతాయిల ఆగడా లను అరికట్టాలని ప్రశాంత వాతా వరణంలో ఉత్సవాలు నిర్వహిం చు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు జయప్రదం చేయండి: టిడిపి

ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం కానున్న వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహ న్ పర్యటన సందర్భంగా నేడు చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు జయ ప్రకాష్ నాయుడు పేర్కొన్నారు. మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ బుధవారం మండలంలోని రాగిమానుపెంట పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేప డతారని ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతి నిధులు, అధికారులు , కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కుప్పం రూరల్ సిఐ మల్లేష్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సీఐకి సన్మానం

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాములు సీఐ కలిసి శాలువతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రూరల్ సీఐగా తాను ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన మరిన్ని జన్మదిన వేడుకలని జరుపుకోవాలని, ప్రజలకు మరింత సేవలు అందించాలని కోరారు.

జిల్లాలో కొత్త ప్రైవేట్ హోమియోపతి కళాశాల

ప్రైవేట్ రంగంలో ఇది ఐదో కళాశాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆయుష్ వైద్యవిధానాలను ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌డిఎ ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు కొత్త ప్రైవేట్ హోమియోపతి కళాశాల మంజూరయ్యింది. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు హోమియోపతి కళాశాలలు మాత్రమే ఉన్నాయి. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం ముత్తిరేవుల గ్రామంలో శ్రీనివాస ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా హోమియోపతి కళాశాల ఏర్పాటుకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. వెంకటేశ్వర హోమియోపతి మెడికల్ కాలేజ్, హాస్పిటల్ పేరుతో కొత్త ప్రైవేట్ కళాశాలలో ప్రతి సంవత్సరం 100 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. సొసైటీలో ఇప్పటికే 50 పడకల ఆసుపత్రి ఉంది. అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల లభ్యతను సవివరంగా పరిశీలించిన తర్వాత మంత్రి ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 7 హోమియోపతి కళాశాలలున్నాయి. ఐదున్నరేళ్ల బిహెచ్ఎంఎస్ కోర్సులలో ఏడాదికి 500మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు జాయిన్ అవుతున్నారు. వీటిలో గుడివాడ, రాజమండ్రి, కడపలోని 3 ప్రభుత్వ హోమియోపతి కళాశాలల్లో ఏడాదికి 120మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ప్రస్తుతం గుంతకల్లు, తిరుపతి, తాడేపల్లెగూడెం, విజయనగరంలో ఉన్న నాలుగు ప్రైవేట్ హోమియోపతి మెడికల్ కాలేజీలు యూజీ ప్రోగ్రామ్‌లో ఏడాదికి 400మంది విద్యార్థులను చేర్చుకుం టున్నాయి. ప్రస్తుతం వున్న ప్రతి హోమియోపతి కళాశాలలో రోజూ దాదాపు 250మంది రోగులు అవుట్ పేషెంట్ సేవల్ని, 15 మంది రోగులు ఇన్ పేషెంట్ సేవల్ని పొందుతున్నారు.

విద్యార్థినులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న లోకనాథన్

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల కేంద్రం లోని బాలికల హాస్టల్లో ఎం లోక నాథన్, వార్డెన్ అరుల్ దాస్‌తో కలిసి విద్యార్థి నులకు మంగళవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ కమిటీ మెంబర్ ఎం లోకనాథన్ మాట్లాడుతూ పేద బాలికలకు తమవంతు తోడ్పాటు అందించాలనే విద్యా సామగ్రి అందించా మన్నారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత స్థితిగా చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లాయర్ వెంకటేష్, రిటైర్డ్ ఆర్‌టిసి ఉద్యోగి ఆనందన్ పాల్గొన్నారు.

గాండ్ల కమ్యూనిటీ భవన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గాండ్ల కమ్యూనిటీ భవనం త్వరలో ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గ పరిధిలో గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వారు స్థానిక టిడిపి నాయకులతో కలిసి కుప్పం పట్టణంలోని కమ్యూనిటీ భవన స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ టిడిపి హయాంలోనే నియోజకవర్గ పరిధిలో పలు కమ్యూనిటీ భవనాల నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు. ఈ భవనాల నిర్మాణం దాదాపు పూర్తి కావస్తున్న సమయంలో రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల కారణంగా టిడిపి అధికారం కోల్పోయిందని, అనంతరం అధికారం చేపట్టిన వైసిపి ఏ ఒక్క కమ్యూనిటీ భవనాన్ని పూర్తి చేయ లేదన్నారు. వైసిపి హయాంలో కుప్పం నియోజకవర్గ పరిధిలో గాండ్ల కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామని ప్రగల్బాలు పలికి, గాండ్ల కులస్తులను మోసగించినట్లు ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ఆయన సహాయ సహకారాలతో కుప్పం పట్టణంలో త్వరితగతిన గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, గాండ్ల కులసభ్యులు పాల్గొన్నారు.

వైద్య శాఖ రాయలసీమ జోనల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస మూర్తిని సన్మానిస్తున్న ఆరోగ్య కేంద్ర సిబ్బంది

శ్రీనివాస్ మూర్తికి ఘన సన్మానం

ప్రజాశక్తి,-పూతలపట్టు: వైద్య శాఖలో రాయలసీమ జోనల్ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన శ్రీనివాస్ మూర్తిని మంగళవారం ఆ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, సెక్రటరీ భోగి, డిస్ట్రిక్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జ్ఞాన శేఖర్ తదితరులు ఆయనను మంగళవారం వారిని పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలిసి మధ్యాహ్నం వారిని దుశ్శాలువాలతో, చందన మాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక ఎంబీబీఎస్ మెడికల్ ఆఫీసర్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి ఎండలపై అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌వో లక్ష్మీనారాయణ

ఎండల్లో తిరిగితే ఆస్పత్రి పాలే..!

- ఆరోగ్య సూత్రాలు పాటించండి - కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -చిత్తూరు: ఎండల్లో తిరిగితే ఆస్పత్రి పాలవుతారని ఆరోగ్య సూత్రాలు పాటించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సూచించారు. వేసవికాలంలో పశువులు, గొర్రెలను మేతకు తీసుకెళితే మనుషులు అధిక ఎండల్లో వడదెబ్బకు గురై ఆస్పత్రి పాలయ్యే ప్రమాదం వుందని సిహెచ్ఓ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దాసరపల్లి ఆది ఆంధ్ర వాడలో ప్రజలకు వడ దెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఉదయం 10.30 గంటల వరకు అనంతరం సాయంకాలం నాలుగున్నర గంటల పైనే పొలం పనులకు పశువులు గొర్రెలు మేతకు తీసుకెళ్లాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఈ ఎండ సమయంలో ఇళ్ల నుండి బయటకు వెళ్ల కూడదని ఒకవేళ ఎవరైనా వడ దెబ్బకు గురైతే మొదట వారికి ఓఆర్ఎస్ ద్రావణం తాగిస్తే ప్రమాదం నుండి బయట పడతారన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు మహిళా ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్య కర్త లేని పక్షంలో గ్రామా ల్లోని చౌక దుకాణాల్లోనూ ఉంచామని వాటిని ప్రతి ఒక్కరూ ఉచితంగా పొందవచ్చ న్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీ నారాయణ, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అగ్నిప్రమాదాలపై అవగాహనలో అధికారుల హెచ్చరిక

ప్రజాశక్తి- పలమనేరు: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా వుండాలని అగ్నిమాపక అధికారులు హెచ్చరించారు. పలమనేరు నియోజకవర్గంలో ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం టీ వడ్డూరు గ్రామంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో, ఇళ్లలో జరిగే గ్యాస్ ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించి ,ఆ ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నివారించాలో వివరిం చారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి మనోహర్ వారి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పారిశుధ్యంతో అంటు వ్యాధులు తరిమేయొచ్చు: ఎంపీడీవో

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: పారిశుధ్యంతో అంటు వ్యాధులను దూరం చేయొచ్చని ఎంపిడివో హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా గంగాధర నెల్లూరు మండలంలోని పాపిరెడ్డిపల్లి, నందనూరు గ్రామ పంచాయతీలలో చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపిడివో తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ ప్రజా రోగ్యాన్ని మెరుగుపరిచి వ్యాధుల వ్యాప్తిని నివారించ వచ్చన్నారు. మరుగుదొడ్లు, మురుగునీటి వ్యవస్థలను నిర్మించడం మాత్రమే కాదని, వాటిని సరిగ్గా ఉపయోగిం చడం, నిర్వహించడం కూడా ముఖ్యమే అన్నా రు. క్రమం తప్ప కుండా చేతులు కడు క్కోవడం, స్నానం చేయడం పరి శుభ్రమైన దుస్తులు ధరించడం వంటివి వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకో వచ్చ న్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేస్తే మనం ఆరోగ్య, పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మించ వచ్చని ప్రజలకు ఎంపీడీవో సూచిం చారు. ఈ కార్యక్రమంలో నందనూరు, పాపిరెడ్డి పల్లి పంచాయతీ కార్యదర్శిలు నిరంజన్, రజిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపిడివో హరిప్రసాద్‌రెడ్డి

కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

కంటి చికిత్సకు 35 మంది ఎంపిక

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కంటి చికిత్సకు 35 మంది ఎంపికయ్యారని చెన్నై శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ నిర్వాహకులు మురళి తెలిపారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం 55 మంది కంటి పరీక్షలు చేసుకోగా అందులో 35 మందికి కంటి సమస్యలను గుర్తించి వీరికి చెన్నై శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్టు వీరికి రానుపోను ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ఆపరేషన్లు చేయనున్నట్టు ఆయన తెలిపారు. గతంలో ఆపరేషన్ చేసుకుని వారికి ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ సిబ్బంది కవిత పాల్గొన్నారు.

ఇంటర్‌లో సాయిహర్షిణి ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - పుంగనూరు: ఇటీవల విడుదలైన ఇంటర్ 2025 ఫలితాలలో పుంగనూరుకు చెందిన సాయి హర్షిణి వెయ్యి మార్కులకు 987 మార్కులు సాధించినట్లు తండ్రి బాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతికి చెందిన నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివినట్లు, పదవ తరగతి వరకు పుంగనూరులో చదివినట్లు తెలిపారు. మంచి మార్కులు సాధించిన సాయి హర్షిణిని పట్టణంలోని తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

గుండె పోటుతో ఉద్యోగి మృతి

అన్సర్ బాష (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న అన్సర్ బాష (59) మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. ఇంటి వద్ద బాత్రూంలో పడిపోవడంతో కుటుంబీకులు హుటాహుటిన ఆస్పత్రి కి తీసుకెళు తుండగా మార్గ మధ్యం లో మృతి చెందాడు. సౌమ్యు డిగా గుర్తింపు పొందిన ఉద్యోగి మృతి చెందడం బాధా కరమని తహశీల్దారు, సిబ్బంది సంతాపం తెలిపారు.